ఉల్లం'ఘనులు'!



కౌటాలలో పాఠశాలకు దగ్గరగా ఉన్న మద్యం షాపు

- నిబంధనలు పాటించని మద్యం వ్యాపారులు
- బార్లను తలపిస్తున్న పర్మిట్ రూంలు
- పట్టించుకోని అబ్కారీశాఖ అధికారులు
- జిల్లాలో 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వైన్స్ కాగజ్‌నగర్ సర్కిల్ పరిధిలోని కౌటాల మండల కేంద్రంలో ఉంది. ఈ వైన్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పర్మిట్ రూం బార్‌ను తలపిస్తుంది. నిబంధనల ప్రకారం పర్మిట్‌రూంలో సిట్టింగ్ చేయకుండా నిల్చొని మద్యం తాగి వెళ్లాలి. కానీ ఈ షాపులో నిబంధనలు అమలు కావడం లేదు. పర్మిట్ రూంలో తినుబండారాలు, నాన్‌వెజ్ ఏర్పాటు చేయడంతో మందుబాబులు ఇక్కడే గంటల తరబడి సిట్టింగ్ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూతవేటు దూరంలో ఉన్న పోలీసులు, నిత్యం పర్యవేక్షించే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కౌటాల: మద్యం సిండికేటును సహించేది లేదని, రాష్ట్రంలో బెల్టుషాపులు కనిపించొద్దని కొత్త సర్కారు ఆదేశించింది. మరోవైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అయినా జిల్లాలోని పలుచోట్ల మద్యం వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. ఏ ఒక్కచోట నిబంధనల ప్రకారం అమ్మకాలు కొనసాగడం లేదు. నిర్వాహకులు బెల్టు దుకాణాలకు ఒక్కో ఫుల్ బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే రూ. 20 ఎక్కువకు అమ్ముతున్నారు. వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి ఒక్కో దుకాణానికి 8- 10 గ్రామాల చొప్పున పంచుకున్నారు. పల్లెల్లో బెల్టు షాపులకు విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. మందుబాబుల కంటే ఆయా గ్రామాల నుంచి వచ్చే బెల్ట్ దుకాణాల నిర్వాహకులకే ముందుగా మద్యం కాటన్లను అప్పగిస్తున్నారు.

బార్లను తలపించేలా..

జిల్లాలో బార్లను తలపించేలా పర్మిట్ రూంలు, సిట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. పర్మిషన్ ఉన్న దుకాణంలో ఎమ్మార్పీకి మద్యం విక్రయిస్తుండగా.. పక్కనే ఉన్న పర్మిట్‌రూంలో రహస్యంగా బెల్ట్ షాపులకు అధిక ధరకు అమ్ముతున్నారు. పలు మండలాల్లో ఆలయాలు, జనావాసాల మధ్య పర్మిట్ రూంలు ఏర్పాటు చేశారు. దీంతో అటుగా వెళ్లేందుకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలు ఉండవు..

వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి, బెల్టుషాపులకు మాత్రమే మద్యం విక్రయిస్తున్న షాపుల వద్ద ఎటువంటి నిబంధనలు కానరావడం లేదు. షాపు ముందు గెజిట్ నంబర్, 18 ఏళ్లలోపు వారికి మద్యం అమ్మబడదు అనే రాతలు, ధరల పట్టిక వంటి వివరాలు ఏమీ కనబడవు. జిల్లాలో ఎక్కడ చూసిన మైనర్ విద్యార్థులు, బాలలు మద్యం దుకాణాలకు వెళ్లి మద్యం కొనుగోలు చేస్తున్నారు. మద్యం దుకాణాల్లో అక్రమాలు విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో మామూలుగా వ్యవహరిస్తున్నారు. దుకాణాల్లో కౌంటర్ల పైనే విడి అమ్మకాలు సాగిస్తున్నా.. రశీదులు ఇవ్వకున్నా.. అధిక ధరలకు విక్రయిస్తున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో విసిగిపోతున్న పలువురు నేరుగా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు.

గుప్పుమంటున్న గుడుంబా..

అధికారులు పట్టించుకోకపోవడంతో మళ్లీ గ్రామాల్లో గుడుంబా గుప్పుమంటోంది. అధికారులు ఎన్ని దాడులు నిర్వహించినా గుడుంబా తయారీ ఆగడం లేదు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలిసి మద్యం అధిక ధరకు విక్రయాలు జరపడంతో సామాన్య ప్రజలు గుడుంబాకు అలవాటుపడుతున్నారు. మద్యం వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నా.. జనావాసాల మధ్య మద్యం దుకాణాలతో ప్రజలకు ఎంత అసౌకర్యం కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అబ్కారీ శాఖ, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించి గుడుంబా తయారీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

పాఠశాల, జనవాసాల మధ్య మద్యం దుకాణాలు ఉండడం వల్ల మహిళలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనవాసాల మధ్య నుంచి వైన్స్‌షాపులను తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. పర్మిట్ రూంలో గంటల తరబడి సిట్టింగ్ చేసి, రోడ్లపైనే, ఇళ్ల ఎదుటే మూత్రవిసర్జన చేస్తున్నారు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– పి.వినోద్, కౌటాల

కఠిన చర్యలు తీసుకుంటాం

నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల్లోనే విక్రయాలు జరపాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూనే ఉన్నాం. ఇటీవల అధిక మద్యం విక్రయిస్తున్న పలు మద్యం దుకాణాలను సీజ్ చేశాం. మద్యం దుకాణాల్లో పర్మిట్ రూంలల్లో నిబంధనలు పాటించాలి. గుడుంబా స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

– శ్యామూల్ జాన్, సీఐ అబ్కారీ శాఖ, కాగజ్‌నగర్

వృథాగా 'భగీరథ' నీరు



లింగాపూర్: మండల కేంద్రంలోని దంపూర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన భగీరథ నీరు వృథాగా పోతుంది. అయినా స్థానికంగా పనిచేస్తున్న సిబ్బంది చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. తాగడానికి నీరు లేక ప్రజలు నానాతంటాలు పడుతుంటే అధికారులు భగీరథ నీటికి నల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో నీరంతా వృథాగా డ్రైయినేజీలో కలుస్తుంది.

అంబేద్కర్ జయంతి జయప్రదం చేయండి

ఎదులాపురం: అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఎన్నికల నియామవళి అమలులో ఉన్న నేపథ్యంలో అంబేద్కర్ 134వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం లేదని, రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాల్లో అంబేద్కర్ వాదులు, అన్ని కుల సంఘాల నాయకులు, రాజ్యాంగ పరిరక్షకులు పాల్గొనాలని కోరారు. నాయకులు నగేశ్, ప్రశాంత్, నవీన్, దయాకర్, సందీప్, రమేశ్, శంకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆదిలాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సర్వారాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొలాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంట గదిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వేడి భోజనం వండించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకుడు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, మరప ముయ్యాల మోతి, ఆశలు నర్మద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి విగ్రహావిష్కరణ

జైనథ్: తెలంగాణ సాంస్కృతిలో గ్రామ దేవతలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, ఏ పని చేసిన గ్రామదేవతలకు పూజలు చేసిన తరువాతే ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాంగ్వి గ్రామంలో నిర్వహించిన పోచ్చమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామస్తులు ఆయనకు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. సర్పంచ్ విఠల్ రెడ్డి, మయూర్ చంద్ర, అశోక్ రెడ్డి, భూమన్న, సురేష్, తరుణ్, వైభవ్, సురేశ్ పాల్గొన్నారు.

ఆర్చీ కూల్చివేత పనుల అడ్డగింత



ఆర్చీని కూల్చివేసేందుకు ప్రొక్లైనర్‌తో వచ్చిన సిబ్బంది

రెబ్బెన: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండల కేంద్రంలో గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన ఆర్చీ (ముఖద్వారం) కూల్చివేత పనులను శుక్రవారం భక్తులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ సిబ్బంది ప్రొక్లెయిన్ వాహనంతో మండల కేంద్రంలోని గంగాపూర్ ఆర్చీని కూల్చివేసేందుకు రాగా గమనించిన భక్తులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా భక్తులు మాట్లాడుతూ జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి మార్గాన్ని తెలియజేసే ఆర్చీ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాల్సి వస్తోందన్నారు. అయితే నేషనల్ హైవే అధికారులు ఆర్చీ కూల్చివేసేందుకు కేవలం రూ.4లక్షల పరిహారం మాత్రమే అందించారని, పరిహారం సరిపోదని సుమారు రూ. 13 లక్షల ఎస్టిమేషన్‌ను కొన్ని నెలల క్రితం అప్పటి కలెక్టర్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. పరిహారం అందించకుండా ఆర్చీని తొలగించేందుకు నేషనల్ హైవే సిబ్బంది ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఆర్చీ నిర్మాణానికి సరిపడా పరిహారం అందాకే కూల్చివేత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దాంతో సమాచారం అందుకున్న రెబ్బెన తహసీల్దార్ జ్యోత్స్న సంఘటన స్థలానికి చేరుకొని భక్తులతో మాట్లాడారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతామని, రెండు రోజుల వరకు కూల్చివేత పనులు చేపట్టవద్దని నేషనల్ హైవే నిర్మాణ సంస్థ సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు



కౌటాల: మండలంలోని కన్నెపల్లి, నాగేపల్లి, కనికి గ్రామాలతో పాటు తాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధి బండలహెట్టి, గోవర్‌హెట్టి గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో లేవు. దీంతో ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాలకు ప్రైవేట్ వాహనాలు అందుబాటులో లేని రోజు ప్రయాణికులకు కాలినడకే దిక్కని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

అతివలకు అండగా..



రాళ్లపేటలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

- న్యాక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టుశిక్షణ
- బ్యాచ్‌లవారీగా గ్రామాల్లో శిక్షణ తరగతులు
- కార్మిక కుటుంబాల మహిళల ఆసక్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామాల్లోని నిరుద్యోగ మహిళలు, యువతులు స్వయం ఉపాధి రంగంలో రాణించాలనే లక్ష్యంతో అందిస్తున్న వృత్తి నైపుణ్యశిక్షణ వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోంది. కార్మిక కుటుంబాల్లోని మహిళలకు న్యాక్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌లో అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా నైపుణ్యాలు అందిస్తున్నారు. శిక్షణ పూర్తయిన వారికి ఉచిత మిషన్లతోపాటు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో సింగరేణి కార్మిక కుటుంబాల్లోని నిరుద్యోగులు కుట్టు శిక్షణపై ఆసక్తి చూపుతున్నారు.

లేబర్‌కార్డు ఉంటేనే శిక్షణ

కార్మికశాఖ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో అందిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ పొందాలంటే లేబర్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రీషియన్, తాపీమేస్త్రీ, ప్లంబింగ్ వంటి పనులు చేసే కార్మికులకు ఇప్పటికే లేబర్ గుర్తింపు కార్డులు జారీచేసింది. కార్మికుల కుటుంబాల్లోని నిరుద్యోగ మహిళలు, యువతులు న్యాక్ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణను పొందాలంటే తప్పనిసరిగా లేబర్‌కార్డులో పేరు నమోదై ఉండాలి. ఈ నిబంధన కారణంగా గ్రామాల్లో చాలామంది ఉత్సాహం ఉన్నా కార్డు లేక శిక్షణకు దూరమవుతున్నారు. లేబర్‌కార్డు ఉన్న కార్మికుడి భార్య, కూతురు వృత్తి నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. లేబర్‌కార్డులో పేరుండి 18 నుంచి 45 ఏళ్లలోపు శిక్షణకు అర్హులు. న్యాక్ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే బ్యాచ్‌లవారీగా శిక్షణ అందిస్తున్నారు.

రెబ్బెన మండలంలోనే ప్రారంభం..

కార్మికశాఖ సహకారంతో న్యాక్ ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాల్లోని మహిళల కోసం వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలోనే మొదటగా రెబ్బెన మండలంలో ఏర్పాటు చేశారు. కుట్టుశిక్షణపై ఆసక్తిఉన్న వారికి దరఖాస్తుల ఆధారంగా గ్రామాల్లో బ్యాచ్‌లవారీగా శిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. 90 రోజుల కాలపరిమితితో రెబ్బెన మండలం నంబాలలో ఆగస్టు 16న 23 మందితో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. మూడు నెలలపాటు నిపుణులతో శిక్షణ అందించారు. అవసరమైన మెలకువలు నేర్పిస్తూ కుట్టుపై నైపుణ్యత సాధించేలా కృషి చేశారు. జిల్లాలో న్యాక్ ద్వారా శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ నవంబర్ 20తో శిక్షణ పూర్తి చేసుకుంది. అనంతరం వారికి పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన వారికి సుమారు రూ.10 వేల విలువైన మిషన్‌తోపాటు కిట్ ఉచితంగా పంపిణీ చేశారు. త్వరలో సర్టిఫికెట్లు అందించనున్నారు. వంకులం పంచాయతీ పరిధిలోని రాళ్లపేటలో 26 మందితో రెండో బ్యాచ్ ఫిబ్రవరి 5న ప్రారంభమైంది.

పట్టు సాధిస్తున్నాం



మా ఊరిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని న్యాక్ అధికారులు చెప్పడంతో దరఖాస్తు చేసుకున్న. రాళ్లపేటలో రెండు నెలల క్రితం కుట్టు శిక్షణ కేంద్రాన్ని తెరిచారు. కుట్టు పనిలో జాగ్రత్తలు, మెలకువలు నేర్పిస్తున్నారు. ఏ మాత్రం అవగాహన లేని నాలాంటి వాళ్లం కూడా కుట్టుపై పట్టు సాధిస్తున్నాం.

– సీహెచ్ అరుణ, వంకులం

శిక్షణ తీసుకున్నా..



నంబాలలో మూడు నెలల పాటు శిక్షణ తీసుకున్నా. క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శిక్షకులు నేర్పిన మెలకువలు నేర్చుకుని స్వతహాగా బట్టలు కుట్టడం నేర్చుకున్నా. న్యాక్ ఆధ్వర్యంలో అందించిన ఉచిత శిక్షణతో భవిష్యత్తులో నా కాళ్ల మీద నేను నిలబడేందుకు దోహదపడుతుంది.

– సనిగారపు శిరీష, నంబాల

మహిళలకు అవసరం



కార్మిక కుటుంబాల్లోని నిరుద్యోగ మహిళలు, యువతలు న్యాక్ ఆధ్వర్యంలో అందించే కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ఇంటి పనులు పూర్తయ్యాక ఖాళీ సమయాల్లో స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం రెబ్బెన మండలంలో కుట్టు శిక్షణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. నంబాలలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్‌తోపాటు కిట్ అందించాం.

– వసుంధర, శిక్షకురాలు

శ్రీవేంకటేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదిలాబాద్ శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఆయన సతీమణి అనిత పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యోగానంద సరస్వతిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

తాంసి: మండలంలోని కప్పర్లలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన చేపట్టారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో మీసేవ నిర్వాహకుడు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

దహెగాం: మండల కేంద్రంలో మీసేవ కేంద్రం నిర్వహిస్తున్న నిర్వాహకుడు ములుకుట్ల శ్రీనివాస్(44) అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం చినగుడిపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ దహెగాంలో మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. గత మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కరాటే పోటీలకు మండల వాసి ఎంపిక

రెబ్బెన: మండలంలోని రాంపూర్‌కు చెందిన కరాటే మాస్టర్ చాపిడి కుమార్ ఈనెల 15న గుంటూరులో చైనీస్ కుంగ్‌ఫూ క్లబ్ ఆధ్వర్యంలో జరగనున్న కరాటే పోటీల్లో పాల్గొంటున్నట్లు మాస్టర్ చాపిడి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లాక్ బెల్ట్ 5వ డిగ్రీలో జరగబోయే పోటీలకు డ్రాగెన్ కుంగ్‌ఫూ క్లబ్ తరఫున పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీసీతారాముల పల్లకీయాత్ర



పల్లకి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చింతలమానెపల్లి: మండలంలో శుక్రవారం కార్తీక్ మహారాజ్ ఆలయ సీతారాముల విగ్రహాల పల్లకీయాత్ర నిర్వహించారు. తుమ్మిడిహేటి వద్ద ఈ నెల 10న ప్రారంభమైన పంచక్రోసి పల్లకీయాత్ర మండలంలోని ఆయా గ్రామాల నుంచి సాగింది. శుక్రవారం మండలంలోని ఖర్జెల్లి, చింతలమానెపల్లి, బాబాసాగర్ గ్రామాల మీదుగా పలకీయాత్రకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 17న తుమ్మిడిహేటి వద్ద పల్లకియాత్ర ముగుస్తుందని నిర్వాహక కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


కాంగ్రెస్‌లో చేరికలు



సాంబగౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు

రెబ్బెన: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీలకు నాయకుల వలసలు పెరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ గోలేటి మాజీ పట్టణ అధ్యక్షుడు దాసరి సాంబగౌడ్ శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సుదీర్ఘ కాలం పాటు టీడీపీలో, టీడీపీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్‌టీయూసీలో పని చేసిన సాంబగౌడ్, తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగెం ప్రకాశ్‌రావు, దుర్గం రవీందర్, సాయి, వామన్, గోలేం గట్టయ్య పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చౌదరి సత్తయ్య, చింతపుడి సత్తయ్యలు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు జంగం శంకర్, పోశన్న, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను శుక్రవారం బాధితులకు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ అప్పగించారు. నామనగర్ గ్రామానికి చెందిన సిండె శ్రీను, రాస్పెల్లి గ్రామానికి చెందిన వరుణ్‌లు సెల్‌ఫోన్‌లను పోగొట్టుకోగా, ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వారికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీంను ప్రత్యేకంగా అభినందించారు.